ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023 5
అనంతపురం




పకడ్బందీగా ఓటర్ల రీవెరిఫికేషన్ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా చేపడుతున్న ఓటర్ల రీవెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సిబ్బందికి ఆదేశించారు. శనివారం నాడు రాప్తాడు మండలంలోని మరూరు, రామనేపల్లి గ్రామాల్లో స్పెషల్ సమ్మర్ రివిజన్–2024లో భాగంగా చేపడుతున్న రీవెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరణం, ఇళ్లు మార్పు తదితర ఓటర్లు అన్నింటినీ రీవెరిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 9, 2023వ తేదీ వరకు జిల్లాలో 96,153 డిలీషన్ క్లెయిమ్స్ వచ్చాయన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా రీవెరిఫికేషన్ పూర్తి చేయాలని బిఎల్ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఈఆర్ఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల్లో అయోమయం

◆ పంట పెట్టుకోవాలా.. వద్దా.. అన్న మీమాంశ ◆ స్పష్టతనివ్వని అధికారులు







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఆయకట్టు రైతులను అయోమయంలోకి పడేస్తున్నాయి. ప్రధాన ప్రాజెక్టుల్లోనూ నీరు ఆశించినంత లేదు. మరోవైపు జిల్లా ప్రాజెక్టుల్లో నీరు పూర్తిగా అడుగంటుతోంది. దీంతో ఆయకట్టుపై ఆధారపడి పంటలు సాగు చేసుకోవాలో లేదోనన్న మీమాంశ రైతాంగంలో నెలకొంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు సాగుకు సమయత్తమై ఉన్నారు. ఎప్పటిలాగానే నీరొస్తుందని భావించి పంట సాగు చేస్తే కీలక సమయంలో నీరు రాకపోతే పరిస్థితి ఏమిటన్న గుబులు రైతుల్లో నెలకొంది. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎప్పటిలాగానే నీరొస్తుందని తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో వరి నార్లు పెట్టుకున్నారు. గత వారంలో కాలువకు గండిపడి నీరురాక కొన్నిచోట్ల నారుమడులు ఎండిపోయే దశకు చేరాయి. రెండు రోజులుగా నీరు పునరుద్ధరణ కావడంతో కాస్తఊరట లభించింది.

ప్రధాన ప్రాజెక్టుల్లో అడుగంటిన నీరు

జిల్లాకు సాగు,తాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టులు రెండున్నాయి. అందులో మొదటి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కాగా, హంద్రీనీవా రెండోది. ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ ప్రస్తుతానికి నీరుంది. అయితే పూర్తి స్థాయిలో 75.39 టిఎంసిలు ఉంది. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటిని వదిలారు. కాని ప్రధాన కాలువకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సెప్టంబర్‌లో వర్షాలు రాకపోతే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా నీరు పూర్తి స్థాయిలో తీసుకోవడంలోనూ సమస్య రానుంది. ఇక శ్రీశైలం డ్యామ్ నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరొస్తుంది. శ్రీశైలం డ్యామ్‌లో ప్రస్తుతం 81.91 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. వర్షాలు వచ్చే నెల కూడా రాకపోతే ఇబ్బంది తలెత్తనుంది. దీంతో హంద్రీనీవా కింద ఆయకట్టు లేనప్పటికీ కాలువ వెంట ఆయకట్టు సాగవుతోంది. నీరు ఈ కాలువలో రాకపోతే పంటలు ఎండిపోయే అవకాశమున్నందున సాగు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో తగ్గిన నీరు

జిల్లాలోనున్న ప్రధాన ప్రాజెక్టుల్లో నీరు చూస్తే పూర్తిగా తగ్గిపోయింది. పిఎబిఆర్ డ్యామ్ నిలువ సామర్థ్యం 11.1 టిఎంసి అయితే 1.9 టిఎంసిలే నీరు నిలువ ఉంది. 5.2 టిఎంసిల నిలువ సామర్థ్యమున్న మిడ్‌పెన్నార్‌లో 1.08 టిఎంసిల నీరుంది. రెండు టిఎంసిల సామర్థ్యమున్న భైరవానితిప్పలో 0.85 టిఎంసిలు నీరుంది. ఇలా ముఖ్యమైన ప్రాజెక్టుల్లో నీరు చాలా తక్కువగానే ఉంది.

ఆయకట్టు పరిస్థితి ఏమిటీ ..?

జిల్లాలో 2.84 లక్షల రిజిష్టర్డు ఆయకట్టుంది. ఇది ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనే ఉంది. ఇందులో ఏటా లక్ష ఎకరాల వరకు తడి, ఆరుతడి పంటలకు నీరిస్తారు. ప్రధానంగా బొమ్మనహాళ్, కణేకల్, ఉరవకొండ, విడపనకల్లు మండలాలుంటాయి. హంద్రీనీవా కింద రిజిష్టర్డు లేకున్నా కాలువ వెంట ఉండే మండలాలు గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, బెళుగుప్ప మండలాలు ఉంటాయి. ఇక్కడ రైతులు వేల ఎకరాల్లోనే సాగు చేస్తారు. నీరు రాకపోతే ఈ రైతులకు ఇబ్బందులు తప్పవు.

కరువు జిల్లాగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, సహాయ చర్యలు వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గత వంద సంవత్సరాల్లో ఆగస్టు నెలలో ఎప్పుడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయిందని చెప్పారు. ఈఖరీఫ్‌లో సాగైనా ఆరు లక్షల ఎకరాల్లో వర్షాభావం వల్ల పంట దాదాపు పూర్తిగా నష్టపోయిందన్నారు. కోట్ల రూపాయలు రైతుల నష్టపోయారని చెప్పారు.



వి.రాంభూపాల్

ఇంకో ఐదు లక్షల ఎకరాల్లో పంటే సాగు కాలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలన్నింటినీ మాఫీచేయాలన్నారు. ప్రయివేటు వడ్డీదారుల ఒత్తిళ్ల నుంచి రైతులను కాపాడేందుకు ఆర్‌డిఒ ఆఫీస్‌లో టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. బోరు బావుల కింద సాగు చేసిన పంటలూ విద్యుత్ కోతల వల్ల ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ కోతలు నివారించి పంటలను కాపాడాలని కోరారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు జిల్లాలో పర్యటించి కరువు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత నెల 30 నుంచి సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4వ తేదీ జిల్లాలోని అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులపై ఎస్మా ప్రయోగిస్తామనడం దుర్మార్గం

◆ ప్రభుత్వం వైఫల్యం చెంది కార్మికులను నిందిస్తారా..
◆ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె
◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తే కార్మికులపై ఎస్మా ప్రయోగిస్తామని బెదిరించడం దుర్మార్గమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. శ్రీసత్యసాయి కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో శనివారం పిఎబిఆర్ డ్యాం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పోలీసులు కార్మికులతో చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో కార్మికులకు సానుకూలమైన హామీ రాకపోవడంతో సమ్మె కొనసాగించేందుకు నిర్ణయించారు. దీంతో పోలీసులు బలవంతంగా మోటార్లను ఆన్ చేసి నీటి సరఫరా చేసేందుకు యత్నించారు. అయితే కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను ఎస్మా ప్రయోగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీసుల వైఖరిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. 26 రోజులుగా పంపు మోటార్లు మరమ్మతులకు గురై ఆగినప్పుడు మరమ్మతు చేయించని కాంట్రాక్టర్‌పై ఎందుకు ఎస్మా ఉపయోగించలేదంటూ ప్రశ్నించారు. కార్మికులంటే ఎందుకు అంత అలుసా..? అంటూ నిలదీశారు. దీంతో చేసేది లేక అధికారులు, పోలీసులు వెనక్కి తగ్గారు. చేసిన పనికి వేతనాలు ఇవ్వాలని అనేకమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు సమ్మె చేపడితే ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని కార్మికులపై ఎస్మా ప్రయోగిస్తామంటూ బెదిరించడం దుర్మార్గమన్నారు. కాగా నేడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సిఐటియు యూనియన్ నాయకులకు చర్చలకు రావాలని పిలిచారు. దీంతో కార్మికులు చర్చలకు వస్తామని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యానికి కార్మికులను నిందితులు చేయడం అన్యాయం

కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వేతనాలు సకాలంలో ఇచ్చి ఉంటే కార్మికులు సమ్మె చేయాల్సిన దుస్థితి వచ్చేది కాదన్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనులకు శాశ్వతంగా నిధులు కేటాయించి తాగునీటి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు పథకం నిర్వహణకు కూడా నిధులు మంజూరు చేయకుండా పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూడటం సిగ్గు చేటుగా ఉందన్నారు. నేడు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలపై ప్రేమ చూపిస్తూ కార్మికులపై పెత్తనం చెలాయిస్తున్నారే, మరీ కార్మికులకు వేతనాలు చెల్లించేలా ప్రభుత్వంతో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వేతనాల కోసం రోడ్లు ఎక్కి ఆందోళన చేయని సంవత్సరం అంటూ లేదన్నారు. ఎప్పుడు సమ్మె చేసిన నెల, రెండు నెలల వేతనాలు ఇస్తామంటూ నమ్మించి సమ్మె విరమింపజేయడం యథాతథంగా 5 నెలల తరబడి బకాయిలు పెట్టడం పరిపాటిగా మారుతోందన్నారు. సమస్య పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగిస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, తిరుపాల్‌నాయక్, త్రిలోక్, వసికేరప్ప, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సిఇఒకు వినతి

శ్రీసత్యసాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, జెడ్పీ ఇన్‌చార్జి సిఇఒ, కేతన్ గార్గ్‌ను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవిఆర్ ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ లిమిటెడ్ కంపెనీ సబ్ కాంట్రాక్ట్ చేస్తున్న కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డికి ప్రభుత్వం నుంచి బిల్లులు ఇచ్చే టప్పుడు నిపుణులతో సంప్రదించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల వేతనాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సంస్థను టెండర్ వేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



రైతులకు పెరటి కోళ్లను పంపిణీ చేసుత్ను కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్ఎస్.మల్లేశ్వరి

పెరటి కోళ్ల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్ఎస్.మల్లేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కెవికె దత్తత గ్రామాలకు చెందిన రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పెరటి కోళ్ల పెంపకం, డైరీ యూనిట్ ఏర్పాటు, వీటిలో మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోళ్ల పెంపకంలో కొక్కెర తెగుళ్లు, నులి పురుగులు, ఖనిజ లవణాల లోపాల సమస్యలు ఉన్నాయన్నారు. వీటి నుంచి కాపాడుకుంటే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుత కాలంలో పెరటి కోళ్ల పెంపకం నుంచి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. నాటుకోళ్ల మాంసం, గుడ్డు వంటి వాటిలో పోషక విలువలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అసోసియేట్ డైరెక్టర్ ఎస్‌సి.వెంకటేశ్వర్లు, కెవికె శాస్త్రవేత్తలు కె.మాధవి, బి.చందన, నవీన్ కుమార్, సిద్ధరాచర్ల, గొల్లపల్లి, సోధనపల్లి, ఈస్ట్ నరసాపురం, పోతురాజుకాలవ రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమలు మూసి... వెంచర్లుగా మార్చి..!

◆ పరిశ్రమ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు
◆ నాడు సూపర్ ఏ మిల్లు.. నేడు బి మిల్లు మూత
◆ రోడ్డున పడుతున్న కార్మికులు
◆ సర్వం కోల్పోయిన భూములిచ్చిన రైతులు



సుపర్ స్పిన్నింగ్ మిల్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

పరిశ్రమల పేరుతో తీసుకున్న భూముల్లో వెంచర్లు వెలుస్తున్నాయి... నష్టాల పేరుతో పరిశ్రమలను మూసివేస్తూ, పేద రైతులు ఇచ్చిన భూములతో పారిశ్రామికవేత్తలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం నియోజవకర్గంలో పలు పారిశ్రామికవాడలు ఉన్నాయి. పరిశ్రమలు వస్తే తమ బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని... ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెంది జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆశతో హిందూపురం నియోజకవర్గం ప్రాంతంలో కారుచౌకగ వందలాది ఎకరాలను రైతులు అతి తక్కువ ధరకే పొలాలను ఇచ్చేశారు. ఇలా వచ్చిన పరిశ్రమల్లో ఈ ప్రాంత యువత తక్కువ వేతనాలకే కార్మికులుగా మారారు. ఈ యువత యాజమాన్యాల సంపద పోగుపడటానికి ఉపయోగపడ్డారు తప్పా, వారి జీవితాలు మాత్రం మారలేదు. కారుచౌకగ భూములు, శ్రామికశక్తి లభించడం, ప్రభుత్వల ప్రోత్సహకాలను పొందడం ఇలా అన్ని విధాల వసతులనూ ఉపయోగించుకున్న పారిశ్రామికవేత్తలు ప్రస్తుతం వారి అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రాడంతో వాటిని సొమ్ముగా చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. నష్టాలను చూపించి ఏకంగా పరిశ్రమలనే మూసివేస్తున్నారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూములను రియల్టర్లకు కోట్లాది రూపాయాలకు విక్రయించి అందులో వెంచర్లను వేసేస్తున్నారు. పరిశ్రమల కోసం సాగులో ఉన్న భూములను ఇచ్చిన రైతులు మాత్రం సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పారిశ్రామికవాడను ప్రారంభించక ముందే కిరికెర సమీపంలో 1962లోనే తమిళనాడు రాష్ట్రానికి చెందిన బాలకృష్ణన్ సుపర్–ఏ స్పిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వందలాది మందికి ఉపాధి కల్పించారు. కాలక్రమేణ 1630 మంది కార్మికుల వరకు అందులో ఉపాధి పొందారు. కొద్ది సంవత్సరాలకే సూపర్ స్పిన్నింగ్ ఏ మిల్లు యాజమాన్యానికి కోట్లాది రూపాయల ఆదాయం చేకూరింది. వేలాది మంది కార్మికుల జీవితాల్లో వెలుగునిచ్చి, ఉపాధి కల్పించిన కల్పతరువుగా సూపర్ ఏ స్పిన్నింగ్ మిల్లు మారింది. ఈ పరిశ్రమ లాభాలతో అనేక ఇతర పరిశ్రమలు, విద్యా సంస్థలను ప్రారంభించింది. 1983వ సంవత్సరంలో కొట్నూరు సమీపంలో సూపర్–బి, పరిగి మండలం గోరపల్లి వద్ద ప్రీకాట్ మెడిరీయన్ స్పిన్నింగ్ మిల్లులను ప్రారంభించారు. దీంతో పాటు కిరికెర వద్ద ఎల్‌ఆర్‌జి పేరుతో పాఠశాల, కళశాలలనూ ప్రారంభించారు. విద్యాసంస్థలు కూడా బాగా అభివృద్ధి చెందడంతో గత రెండూ సంవత్సరాల క్రితం మరో విద్యాసంస్థను ప్రారంభించారు. 2011లో గోరంట్ల రోడ్డులో సూపర్ సారా పేరుతో మిల్లును ప్రారంభించారు. ఇలా ఈ ప్రాంతంలో పరిశ్రమలు పెరిగి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన కల్పతరువుగా సూపర్ స్పిన్నింగ్ మిల్లు నిలిచింది. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఎన్‌జి బాలకృష్ణన్ మరణాంతరం కార్మికులు వారి సొంత నిధులతో పట్టణంలో ప్రధాన కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

రాత్రికి రాత్రే యంత్రాల తరలింపు...

బాలకృష్ణన్ మరణం తరువాత సూపర్ స్పిన్నింగ్ మిల్లు పరిశ్రమ నిర్వహణలో చాలా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం ఉన్న యాజమాన్యం కార్మికుల పొట్టగొట్టి ప్రభుత్వం, కార్మిక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రికిరాత్రే పరిశ్రమలో ఉన్న యంత్రాలను తరలించేసింది. పరిశ్రమ భూములను రియల్టర్లకు విక్రయించారు. దీంతో ఇప్పటికే కిరికెర వద్ద పరిశ్రమ భూమిలో వెంచర్లు వెలిశాయి. 2011లో ప్రారంభించిన సూపర్ సారా మిల్లు స్థలాన్ని వేరే పరిశ్రమకు లీజుకు ఇచ్చారు. ప్రస్తుతం సుపర్–బి మిల్లు మూసివేశారు. ఈ స్థలాన్ని రియల్టర్లకు విక్రయిస్తారా...?, ఎవైన పరిశ్రమలకు లీజుకు ఇస్తారా...? అన్న విషయం యాజమాన్యం నిర్ణయంపై ఆధారపడి ఉంది. పరిశ్రమలు, స్థానిక యువత ఉపాధిపై, దృష్టి సారించాల్సిన పాలకులు, ప్రజా ప్రతినిధులు వీటి గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా విన్నకుండి పోతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నూతన పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామంటూ తరచూ చెబుతున్న సమయంలో ఉన్న పరిశ్రమలు మూతబడుతున్నా స్థానిక నేతల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం గమనార్హం.



Super Spinning Mills Limited

Regd. & Central Office : "Elgi Towers" P.B. 7113, Green Fields, 737-D, Puliakulam Road, Coimbatore - 641 045.

S. No	Disclosure on closure of operations of any unit / division (entirety or piecemeal)		
i)	Date of such binding agreement, if any, entered for sale of such unit/division, if any	Not Applicable	
ii)	Amount & percentage of turnover or revenue or income and net worth of the listed entity contributed by such unit or division during the last financial year	Figures based on financial year 2022-23	
		Turnover of the unit	Rs. 7966 lakhs
		Percentage of Turnover to total income	93%
		Net Worth of the entity contributed by the unit	Rs. 8594 Lakhs (approximately)
iii)	Date of closure or estimated time of closure	31.08.2023	
iv)	Reasons for closure	a. Unviable operations due to continuous production loss in spite of attempts to turn it around. b. The SUPER B Unit experienced a major breakdown of the Machine, resulting in a potential higher restoration cost.	

We request you to kindly take the same on record.

Thanking you

Yours truly
For Super Spinning Mills Limited
Narmatha G K
Narmatha G K
Company Secretary and Compliance Officer

RECOGNISED EXPORT - TRADING HOUSE
Phone : +91-422 - 2311711, Fax : 91 - 422 - 2311611, E-mail : super@ssh.saraelgi.com
CIN : L17111TZ1962PLC001200 Web : www.superspinning.com

యంత్రాలను అమ్మకానికి పెట్టిన లేఖ

పథకం ప్రకారం కార్మికుల సంఖ్య తగ్గింపు

యాజమాన్యం పరిశ్రమలను మూసి వేయాలని ఒక పథకం ప్రకారం కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. సుపర్–బి మిల్లులో దాదాపు 1600 మంది కార్మికులు పని చేస్తుంటే కార్మికులపై భారీగా పనిఒత్తిడి పెంచింది. నిబంధనల మేరకు పరిశ్రమలో కార్మికులకు స్వేచ్ఛాయుత వాతవరణాన్ని కల్పించాల్సిన యాజమాన్యం కార్మికులను వేధిస్తూ ఇచ్చిన వేతనాల్లో సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో తీసుకోవడం, పని ఒత్తిడి పెంచి, పని చేయలేదని రూ.1000 అపరాధ రుసం విధించడం లాంటివి చేసి కార్మికుల సంఖ్యను తగ్గించింది. మరికొంత మందికి విఆర్ఎస్ ప్రకటించి ఇంటికి పంపారు. చివరకు పరిశ్రమ మూసివేసే సమయంలో కేవలం 76 మంది మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సుపర్–ఏ మిల్లు కార్మికులకు మాత్రం ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారమూ ఇవ్వలేదు. తమకు న్యాయం చేయాలని కార్మికులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు బెంచ్ సైతం కార్మికులకు న్యాయం చేయాలని తీర్పును వెలువరించినట్లు తెలుస్తోంది. అనంతపురం కార్మిక శాఖ కోర్టులో మాత్రం ఇంత వరకు ఈ కేసు పరిష్కారం కాలేదు. ఇలా పురం పారిశ్రామిక వాడలో ఒక్కో పరిశ్రమ మూత వేస్తూ, ఆ భూములను అమ్మేసుకునే కుట్రలు జరుగుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించి తప్పని సరి పరిస్థితుల్లో పరిశ్రమలు మూసి వేయాల్సి వస్తే ఆ భూములను సంబంధిత పేద రైతులకు వెనక్కు ఇచ్చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని తిప్పయ్యదొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగాన్ని ఇస్తాయన్నారు. జగనన్న ప్రభుత్వం అంగన్‌వాడీలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

తట్రకల్లు కెజిబివి ప్రిన్సిపల్‌కు ఉత్తమ అవార్డు

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని తట్రకల్లు కేజీబీవీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ధనలక్ష్మికి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినట్లు రెడ్‌ప్లస్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ షేక్షావలి తెలిపారు. రెడ్‌ప్లస్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన స్వచ్ఛంద సంస్థలు, సేవకులకు ఉద్యోగులకు అవార్డులు ఇవ్వడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం గుత్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపికైన తట్రకల్లు కెజిబివి కళాశాల ప్రిన్సిపల్ ఎం.ధనలక్ష్మికి అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు గౌతమ్‌రాజు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు హరిప్రసాద్, రెడ్‌ప్లస్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు షేక్ మాఫిర్, ఖాజామొయిద్దీన్, కెఎస్ మున్నా, లక్ష్మిరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న తట్రకల్లు కెజిబివి ప్రిన్సిపల్ ధనలక్ష్మి

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

జిల్లాలో వేగవంతంగా ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను కొనసాగిస్తున్నల్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం నాడు రాబోయే పంటలకు నీటి లభ్యత, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.అనంతపురం కలెక్టరేట్ లోని విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ పరిధిలో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామన్నారు. త్వరలో చేపట్టబోయే గహ ప్రవేశాలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఉపాధి హామీ కింద అమలు చేస్తున్న సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, బిటి రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణం, ఇతర అన్ని రకాల పనులపై సమీక్ష నిర్వహించి వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఒ ప్రశాంత్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 12,570 ఈవీఎంలు




ఈవీఎంలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాకు కొత్తగా 12,570 ఈవీఎంలు వచ్చాయని, వాటిని నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్‌లోని గోడౌన్‌లో జాగ్రత్తగా భద్రపరిచినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. శనివారం నాడు నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం ఆవరణలో జిల్లాకు కొత్తగా వచ్చిన ఈవీఎంలను డిఆర్ఒ గాయత్రీదేవి, ఆర్డీవో మధుసూదన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జెసి పరిశీలించారు. అందరి సమక్షంలో ఆయా ఈవీఎంల గోదాము గదుల తలుపుల సీళ్లను జాయింట్ కలెక్టర్ తీయించారు. తర్వాత లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలతో పాటు గదులను, భద్రత చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరుస్తున్న తీరు పట్ల సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం బెంగళూరులోని బెల్ కంపెనీ నుంచి అనంతపురం జిల్లాకు కొత్తగా 12,570 ఈవీఎంలను పంపించిందన్నారు. అందులో 7,070 బ్యాలెట్ యూనిట్స్, 5,500 కంట్రోల్ యూనిట్స్ ఉన్నాయన్నారు. ఈవిఎంలను గోడౌన్లో పటిష్ట బందోబస్తు మధ్య భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రకోపం-పాలకుల వైఫల్యం..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఉమ్మడి అనంతపురం జిల్లా దుర్భిక్షం అలుముకుంటోంది. 2019వ సంవత్సరం నుంచి జిల్లాలో వర్షాలు బాగానే రావడంతో జిల్లాలో పచ్చటి వాతావరణం నెలకొంది. ప్రకృతిలో కొంత మార్పు వచ్చిందని భావించారు. ఇటువంటి తరుణంలో 2023లో దేశ వ్యాప్తంగానే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచే ఇటువంటి వాతావరణం ఏర్పడింది. జులై నెల ఆఖరులో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కొంత పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టులో చినుకు జాడ కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా కేవలం 13 మిల్లీమీటర్లు మాత్రమే ఆగస్టు నెలలో వర్షం పడింది. వంద సంవత్సరాల కాలంలో కీలకమైన ఆగస్టు నెలలో ఇంత వర్షపాత లోటుండటం గమనార్హం. ఏది ఏమైనా ఈ రకమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడం ప్రకృతి ప్రకోపమనే చెప్పాలి. పాలకుల వైఫల్యాలూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాలుగేళ్లుగా ప్రాజెక్టుల మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడం ఈఏడాది సమస్యగా మారింది. గతేడాది వర్షాలు బాగా రావడంతో నీరు పుష్కలంగా వచ్చింది. పెన్నానది, చిత్రావతి మొదలుకుని అన్ని నదుల్లో నుంచి వంద టిఎంసిల నీరు వృథాగా దిగువకు పోయింది. నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం లేక ఈ నీరు వృథా అయ్యింది. దీనికితోడు జిల్లాకు ప్రధాన సాగునీటి వనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ మధ్యలో ఆగడంతో తరచూ గండ్లుపడుతున్నాయి. ఈఏడాదీ అదే పరిస్థితి నెలకొంది. అసలే వర్షాల్లేని సమయంలో తుంగభద్ర డ్యామ్‌కు వచ్చిన నీరైనా జిల్లాకు తెచ్చుకుందామంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తరచూ గండ్లుపడుతున్నాయి. ఈ ఏడాది మూడుసార్లు గండ్లుపడ్డాయి. దీంతో ఆయకట్టు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇక బోరుబావుల కింద పంటనైనా రక్షించుకుందామంటే విద్యుత్ సరఫరాలోనూ సమస్య ఉంది. తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రకటన ఆచరణలో లేదు. ఆరు గంటలు కూడా రావడం లేదు. దీంతో బోరుబావుల కిందనున్న పంటలు కూడా ఎండిపోతున్నాయి. ప్రకృతి ప్రకోపానికి తోడు ప్రభుత్వ వైఫల్యాలు వెరసి రైతులను తీవ్రమైన ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నాయి. ఇంతటి దయనీయ స్థితి జిల్లాలో నెలకొన్నా ఇప్పటి వరకు మంత్రులెవరూ కరువు పరిస్థితులపై కనీసం సమీక్ష చేయకపోవడం శోచనీయం. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సమీక్షను పూర్తి చేశారు. కాని కరువు, విద్యుత్ సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందులపై మాత్రం ఎటువంటి సమీక్ష లేకపోవడం శోచనీయం. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ దీనిపై చర్చ జరగలేదు. దీన్ని బట్టి ప్రభుత్వం కరువను ఎంత సీరియస్‌గా తీసుకుందన్నది స్పష్టమవుతోంది. విపక్షాలు కరువు సమస్యపై స్పందిస్తూన్నాయి. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. విద్యుత్ సమస్యపై రైతులు చేస్తున్న ఆందోళనలో పాల్గొనడమే కాకుండా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కరువులో ఉన్న జిల్లావాసులను ఆదుకునే చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే గుణపాఠం తప్పదు

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు



గుంతకల్లులో సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరిలో భాగంగా శనివారం పట్టణంలోని 26 సచివాలయాల్లో సిపిఎం నాయకులు ప్రజా సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అనేక భారాలు మోపుతున్నాయన్నారు. ప్రధానంగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టకుండా సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, రూ.400కే వంట గ్యాస్ ఇవ్వాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ప్రజా పంపిణీ ద్వారా 12 రకాల సరుకులు సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న గ్రూప్ 1, 2 పోస్టులను భర్తీ చేయాలని, డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, గిరిజన యువతకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వాలని, పట్టణాల్లో కూడా ఉపాధి పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, చంద్రశేఖర్, ఓబులేసు, రామునాయక్, చరణ్, వెంకీ, షాషా పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ధరల పెరుగుదలను నియంత్రించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని 19 సచివాలయాల్లో అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బడా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టి వేసిందని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజల ఆర్థికస్థితి దివాలా తీసే విధంగా తయారు చేసిందన్నారు. ఇంతటి భారాలు వేసి వచ్చిన ఆదాయంతో అభివృద్ధి ఏమైనా చేసిందా అంటే అదీ లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ధరలను అదుపు చేయాలని, పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, పట్టణాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోవు కాలంలో పెద్దఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి, నగర నాయకులు రామిరెడ్డి, వలి, మసూద, రాజీవ్‌కాలనీ ఎంపిటిసి రమీజాబీ, బాబు, బాలకృష్ణ, గఫూర్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, రామాంజి, ఫక్రు, ఎస్‌కె.మహమ్మద్, డేవిడ్ వహీదా, మహేష్, ఉమేష్ చంద్ర, ఫర్హాది, సునంద, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు శ్రీనివాసులు, పుల్లన్న, పాల్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12, 17, 18, 19వ వార్డుల సచివాలయాల్లో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల నాయకురాలు ఎస్.రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్నీ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, బాలమ్మ, పద్మావతి, అంజి, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి



ఇల్లూరులో పంట నమోదుపై రైతులతో చర్చిస్తున్న ఎడిఎ రవి, ఎఒ సోమశేఖర్

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటలను నమోదు చేయించుకోవాలని అనంతపురం డివిజన్ ఎడిఎ రవి సూచించారు. శనివారం మండల పరిధిలోని ఇల్లూరు, జంబులదిన్నె గ్రామాల్లో స్థానిక వ్యవసాయ అధికారులు చేపట్టిన పంటల నమోదును స్థానిక మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా పంట నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. అదేవిధంగా సాగు చేసే పంటలకు తెగుళ్ళ, పురుగులు సోకకుండా రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇంతవరకూ ఖరీఫ్-23కి సంబంధించి 9487 ఎకరాల్లో వర్షాధారం, 19,999 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు అనిత, ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న ఉరవకొండ వ్యవసాయ అధికారి శుభకర్

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులకు అవసరమైన ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. శనివారం ఉరవకొండలోని రైతుభరోసా కేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలు సాగు చేశారన్నారు. వారికి అవసరమైన ఎరువులను ప్రతి గ్రామ రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పంటలు సాగుచేసిన రైతులను గుర్తించి ఎరువులను పంపిణీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఈనెల 15వ తేదీలోపు రైతు భరోసా సిబ్బంది, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వందశాతం ఈక్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని నెమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయమే స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వెండి కవచం, సువర్ణ కిరీటాన్ని ధరించి తమలపాకల పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు అనిల్ స్వామి తెలిపారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులకు బళ్లారికి చెందిన లాయర్ హనుమంతప్ప అన్నదానం చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు. ఆలయంలో భక్తుల సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత ప్రసాదం, వాహనాలు పార్కింగ్ వద్ద క్యూ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు.

ఘనంగా నరసింహస్వామి ఉత్సవం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం లక్ష్మీ నరసింహస్వామి పల్లకీ ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు సుబ్రమణ్యం స్వామికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్య పూజలు చేశారు. అనంతరం పూల పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. అనంతరం శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి గురు రాఘవేంద్రప్రసాద్, కోశాధికారులు సత్యనారాయణ, నరసింహులు కార్యవర్గ సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, కమలాక్షుడు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎయిర్‌ఫోర్స్ కస్టమ్స్ విశ్రాంత అధికారి పచ్చి వెంకటస్వామి

ఉరవకొండ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పట్టణానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ కస్టమ్స్ విశ్రాంత అధికారి పచ్చి వెంకటస్వామి శనివారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. కళాశాలలె ల్యాబ్‌లో కంప్యూటర్లతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ రూ.లక్ష చెక్కును ప్రిన్సిపల్ జి.రామకృష్ణకు అందజేశారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం దాత వెంకటస్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అరుణ జ్యోతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో గేట్స్ సిబ్బంది

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎం.ఎల్.ఏ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో సైట్ ఇంజనీర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్, ప్రాజెక్టు, మేనేజర్ సేల్స్ మేనేజర్లు ఉద్యోగాల కోసం కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారికి కంపెనీ శిక్షణానంతరం రూ.2.4 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు ఎంపికైన విద్యార్థులను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి అభినందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు యూసఫ్, అర్షద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ప్లేస్మెంట్ అధికారి తన్వీర్ తదితరులు ఉన్నారు.

గురువులను గౌరవించడం ధర్మం

'ఆచార్యదేవోభవ' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

గురువులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాల్లో శాగంగా ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఆచార్యదేవోభవ పుస్తకాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి ఎస్.ఏ.కోరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ పతికి రమేష్ నారాయణ, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ నెహ్రూ యువ కేంద్రం డిడిఓ శ్రీనివాసులు, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరరమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, రియాజుద్దీన్, బాలాజీ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీహరిమూర్తి పాల్గొన్నారు.

మంత్రి ఉషశ్రీచరణ్‌ని కలిసిన రమణానాయక్



మంత్రి ఉషశ్రీచరణ్‌కు బొకే అందజేస్తున్న డాక్టర్ రమణానాయక్

శింగనమల : రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి ఉషశ్రీచరణ్‌ని కళ్యాణదుర్గంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శింగనమల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణానాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి బొకే అందజేశారు. ఆయన వెంట జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ ఉన్నారు.

అయ్యగార్లపల్లిలో పొలంబడి

ప్రజాశక్తి-శెట్టూరు

మండలంలోని అయ్యగార్లపల్లిలో రైతు మల్లయ్య పొలంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆకు కత్తిరింపు, నేల స్థితి, వాతావరణం, వేరు శనగ పంటలో ప్రస్తుతం ఉన్న శత్రు, మిత్ర పురుగులు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం వంటి విషయాలపై వివరించారు. ఈ సందర్భంగా పొలంబడి సమన్వయకర్త రంగస్వామి మాట్లాడుతూ ప్రతి రైతుపొలం బడి ద్వారా శాస్త్రవేత్తగా మారాలని పిలుపునిచ్చారు. అలాగే వేరుశనగ పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు, ఎరువుల యాజమాన్యం, ఐపిఎంపై వివరించారు. ఎడిఎ యల్లప్ప మాట్లాడుతూ పంటలు పూత దశలో జిప్సం వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎడిఎ యల్లప్ప, జడ్పిటిసి మంజునాథ, ఎఒ సంధ్యకుమారి, ఎస్‌సి ఎస్ఒ గౌరి, విఎఎ నందకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణమ్మ, పి.ఉమాదేవి



గుంతకల్లులో వైఎస్ఆర్ పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ

ప్రజాశక్తి-గుంతకల్లు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీలంక కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు పౌష్టికాహారాన్ని అందజేస్తోందన్నారు. అదేవిధంగా రోజూ ఐరన్ పుష్కలంగా లభించే ఆకుకూరలు, కూరగాయలను అధికంగా తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేష్మా, కార్యకర్త ఖాన్, అంగన్‌వాడీ వర్కర్ ధనలక్ష్మి, హెల్పర్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని పెరవలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో సిఎం జగన్ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు రాగిపిండి, వేరుశనగ చెక్కిళ్లు, బెల్లం అటుకులు, ఖర్జూరాలు, పాలు, గుడ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు మునగాకు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పు దినుసులను క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఇకపోతే ఇంటి పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశాబీ, అంగన్‌వాడీలు ప్రసన్న రాణి, రమణమ్మ, ఆయాలు అరుణమ్మ, అశ్వర్థమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



శింగనమల మండలం పెరవలిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పి.ఉమాదేవి

పవన్‌కళ్యాణ్‌తోనే భావితరాల భవిష్యత్తు : జనసేన



రక్తదానం చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్‌లోని కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల తో కలిసి టిసి వరుణ్ సహపంక్తి భోజనం చేశారు. అదేవిధంగా కార్యక్రమాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు భవానీ రవికుమార్ ఆధ్వర్యంలో కేక్ కోసం పంచిపెట్టారు. వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువ త వ్యవస్థాపకులు స్వామినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్ ఒడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శి రాపా ధనుంజయ్, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పురి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రోల్ల భాస్కర్, వెంకటనారాయణ, హుస్సేన్, దరాజ్ భాష, నగర కార్యదర్శిలు కుమ్మర మురళి, శ్రీలాల్ స్వామి, రాజేష్ కన్నా, సంపత్, అంజి, శేషాద్రి, వెంకటరమణ, నెట్టికంటి హరీష్, ఆకుల అశోక్, ఆకుల ప్రసాద్ పాల్గొన్నారు.

నార్పల : భావితరాల భవిష్యత్తును కోరే వ్యక్తి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రమే అని జనసేన పార్టీ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేక్‌కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుపాకుల భాస్కర్, రహమతుల్లా, రామయ్య, బాబావలి, చింతా రామకృష్ణ, విజయ్, చిన్నా, బాబా నజీర్, అశోక్, గిరీష్, నరసింహా, పవన్, కళ్యాణ్, అన్సర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సమక్షంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇసుక విధానాల వల్ల పనులు లేక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వస్తే కార్మికుల పట్ల ఎంతో అంకిత భావంతో పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం దాదాపు వందమందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ సీనియర్ నాయకులు తుపాకులకు భాస్కర్, కలువాయి విశ్వనాథ్‌రెడ్డి, పొన్నతోట రామయ్య, ఉట్టి నరసింహులు, లోకేష్, నారాయణస్వామి, రాజకుళ్లాయప్ప, హరీష్, దాడితోట శివయ్య, అశ్వర్థరెడ్డి, సుభహాన్, రమణయ్య, రాము, రామంజి, మధు భవన నిర్మాణ కార్మికులు, జనసైనికులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని నగరేశ్వర అలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మధు, క్రిష్ణ, నాని, తిప్పయ్య, శేఖర్, వరుణ్, మల్లికార్జున, అజయ్, అభి, మణి, గణేష్, మనోజ్, నాగరాజు, మహేష్, రవినాయక్, శివ, నాగపవన్, కళ్యాణ్ అభిమానులు, జనసైనికులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని ఎరువులు, మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి వీరాస్వామి ఆధ్వర్యంలో అనంతపురం రీజినల్ విజిలెన్స్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, కెమికల్ దుకాణాల్లో కాలం చెల్లిన పురుగు మందులను సీజ్ చేశారు. అలాగే ఆగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ దుకాణాల్లో స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దుకాణదారులు ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలన్నారు. అలాగే కొన్న ప్రతి వస్తువుకూ బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన ఎరువులు, పురుగు మందులను విక్రయించరాదన్నారు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రీజినల్ విజిలెన్స్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి జె.వాసుప్రకాష్, ఎస్ఐ పి.ఫణీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన వామపక్ష నాయకులు

నార్పల : నూతనంగా తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన హరికుమార్‌ను మండల వామపక్ష నాయకులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఇళ్ల పట్టాలు, అసైన్డ్ భూములు, తదితర సమస్యల తహశీల్దార్‌తో చర్చించారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నల్లప్ప, చంద్రమౌళి, సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి రామంజి, సుధాకర్, నాగరాజు, రమేష్, పెద్దోడు, పెద్దిరాజు, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం అధ్యక్షుడిపై దాడి అమానుషం

శింగనమల : చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడుపై పోలీసులు దాడి చేయడం అమానుషమని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర నాయకులు డేగల కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులపై జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో రోజురోజుకీ నిరసనలు చేపడుతుంటే భరించుకోలేక ప్రకాష్‌నాయుడుపై పోలీసులతో ఒత్తిడి తెచ్చి తీవ్రంగా కొట్టించడం బాధాకరమన్నారు. ముమ్ముందు ఇలాగే కొనసాగితే సర్పంచులు, పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు

రాయదుర్గంరూరల్ : వర్షాలు కురవాలని ముస్లిములు శనివారం ఉదయం పట్టణంలోని కనేకల్ రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజ్ చేశారు. ఈనమాజ్‌లో విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా వర్షాలు కురవాలని దువా(ఆలాపన) చేశారు. హాఫీజ్ నజీర్ అహ్మద్ నమాజ్ చదివించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎఇ ద్రాక్షాయణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టిపాడు గ్రామంలో సక్రమంగా తాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. గ్రామంలో ఉన్న బోరునీరు ఉప్పుగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వెంటనే ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు గుంతకల్లు అధ్యక్షులు రాము, ఉరవకొండ అధ్యక్షులు పేన్నయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బంజారాలు ఉన్నత ఉద్యోగాలు సాధించడం ఆదర్శనీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అట్టడుగు వర్గాల్లో పుట్టి, పేదరికాన్ని జయించి ఉన్నత ఉద్యోగాలు సాధించిన బంజారా యువత ఆదర్శంగా నిలిచారని టిటిడి బోర్డు కమిటీ సభ్యులు, సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి సి.అశ్వర్థనాయక్ అన్నారు. నగరంలోని బంజారా భవన్‌లో ఎబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ బాలాజీనాయక్ అధ్యక్షతన శనివారం ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ ఆధ్వర్యంలో గ్రూప్-1 విజేతలైన భరత్‌చౌహన్, శివనాయక్, టిటిడి బోర్డు కమిటీ సభ్యులుగా ఎన్నికైన అశ్వర్థనాయక్‌ను ఘనంగా సన్మానించారు. గ్రూపు.1 ఉద్యోగాలు సాధించడం బంజారా జాతికే ఆదర్శమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని బంజారా విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణనాయక్, చక్రేనాయక్, ఎస్.బాలాజీనాయక్, పి.బాబునాయక్ సేవాఘడ్ ట్రస్టు కోశాధికారి బాలానాయక్, ట్రస్టీ రంగ్లానాయక్, ఎబిఎస్ఎస్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులునాయక్, మహిళా అధ్యక్షురాలు సుగుణాబాయి, ఉపాధ్యక్షులు కిరణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గుత్తి : మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తికి చెందిన నాగరత్నమ్మ పని నిమిత్తం యాడికి సమీపంలోని కోనకు కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్లింది. అక్కడ పని ముగించుకుని తిరిగి గుత్తికి వస్తుండగా మార్గమధ్యలో జక్కలచెరువు వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనుక వైపు కూర్చున్న నాగరత్నమ్మ కింద పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరత్నమ్మ ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.




అనంతపురంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు, బుక్కరాయసముద్రంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ రాజశేఖరరెడ్డి మన మధ్యలో లేకపోయినా పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ వర్థంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాకేంద్రంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ వైఎస్ఆర్ మరణించి 14 ఏళ్లయినా తెలుగు ప్రజలు ఆయనను మరువలేదన్నారు. ఆయన పరిపాలించిన విధానం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞం చేపట్టి అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఘనత వైఎస్ఆర్‌దని అన్నారు. రాయలసీమకు అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా 2012 నుంచి కష్ణా జలాలు వస్తున్నాయంటే అది వైఎస్ఆర్ చొరవ వల్లేనని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి ఎంతో మందికి పునర్జన్మ ఇచ్చారని, ఫీజు రీయింబర్స్ పథకం వల్ల ఎంతో మంది నిరుపేదలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లా రైతాంగం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

వైఎస్ఆర్ ఘాట్‌ను సందర్శించిన 'అనంత'

వైఎస్ఆర్ వర్థంతిని పురస్కరించుకుని వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఇడుపులపాయలో ఉన్న ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మేయర్ వసీం, ఎపి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు సైపుల్లాబేగ్, జేసీఎస్ కన్వీనర్లు ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్, కమల్‌భూషణ్, ఇషాక్, నాయకులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పేదల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. వైఎస్ఆర్ వర్థంతిని పురస్కరించుకుని మండల కేంద్రం సమీపంలోని ముసలమ్మ కట్ట దగ్గర ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి వైఎస్ఆర్ అన్నారు. తెలుగుజాతి ఉన్నంతకాలం చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ సిహెచ్ ప్రమీల, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచులు, ఎంపిపిలు, మండలాల కన్వీనర్లు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకటరాముడు, తిరుపాలు, కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని సీమలవాగుపల్లి, వరదాయపల్లి గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు పాలు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రామయ్య మాట్లాడుతూ వైఎస్ఆర్‌కు, ప్రజలకు విడదీయలేని సంబంధం అన్నారు. ముఖ్యంగా రైతులకు ఆయన చేసిన మేలు మరువలేనదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, వరదాయపల్లి సర్పంచి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలో వైఎస్ఆర్ వర్థంతిని వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాడికి : వైఎస్ఆర్ వర్థంతిని పురస్కరించుకుని సర్పంచి పండు అనురాధ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల మృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు ఎంపిటిసిలు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : నిత్యం ప్రజల కోసం పరితపించి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి, ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కుతుందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రజల నుంచి దూరమై 14 ఏళ్లు గడుస్తున్నా ప్రజల్లో అభిమానం మాత్రం చెక్కు చెదరలేదన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళు శిల్ప, వైసిపి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైస్‌ఛైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు గోవిందరాజులు, సంజీవ, లావణ్య, శారదమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : వైసిపి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కొటాలపల్లి హరినాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు భీమునిపల్లి రామచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సత్యంరెడ్డి నారాయణరెడ్డి, శ్రీరాములు, మోహన్‌రెడ్డి, దేవమోహన్‌రెడ్డి, వేణు వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బోయ రమణ, శివ పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

అనంతపురం : వెనుకబడిన రాయలసీమ విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్ కొనియాడారు. వైఎస్ఆర్ వర్థంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురానికి జెఎన్‌టియుని తీసుకొచ్చిన జీవ ప్రధాత వైఎస్ఆర్ అన్నారు. అదేవిధంగా 108, 104, ఆరోగ్యశ్రీ, గృహనిర్మాణం, జలయజ్ఞంతోపాటు అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు ఇ.కేశవరెడ్డి, పి.సుజాత, పద్మ సువర్ణ, వి.బి.చిత్ర, బి.దుర్గా ప్రసాద్, ఎ.సురేష్‌బాబు, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.వి. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, హాస్టల్ మేనేజర్ టి.బాలనరసయ్య, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, పిఆర్ఒ ఎం.రామశేఖరరెడ్డి, యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్టార్ మధుసూదన్‌రెడ్డి, రంగానాయక్, దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం, బోధనేతర సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జెఎన్‌టియులో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది





నార్పలలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు, రాయదుర్గం, పెద్దపప్పూరు మండలాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు